క్లుప్తంగా

నిలుచోబెట్టే వైద్యం..



కుర్చీలు లేక వైద్యుల వద్ద నిల్చుని పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

మణుగూరుటౌన్: మణుగూరు 100 పడకల ఆస్పత్రిలో వివిధ వైద్య చికిత్సలు, పరీక్షల కోసం వచ్చే రోగులకు కుర్చీ సదుపాయం కూడా లేకపోవడంతో శనివారం పలువురు వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఒకే గదిలో ఉన్న ఇద్దరు జనరల్ వైద్యులను ఏర్పాటు చేయడంతో ఆ గదిలోకి వెళ్లేందుకు వృద్ధులు, ఆరోగ్యం బాలేనివారు గంటల కొద్ది లైన్‌లో నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరిగా వైద్యుడి వద్దకు చేరగానే కనీసం కూర్చోబెట్టి స్టెతస్కోప్ పెట్టకుండానే రోగ నిర్ధారణ చేసి మందులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు కూర్చున్న దగ్గర నుంచి లేచి స్టెతస్కోప్ పెట్టరు.. రోగి కూర్చోడానికి కుర్చీ ఉండదు.. అంటూ నిలదీశారు.

కుమురం భీం ఆశయాలను సాధిద్దాం..

దుమ్ముగూడెం: గిరిజనులు తమ భూముల్లో స్వేచ్ఛగా జీవించేందుకు పోరాటాలు చేసిన కుమురం భీం ఆశయాలను సాధిద్దామని గిరిజన సంఘం జిల్లా నాయకుడు మర్మం చంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సుబ్బారావుపేటలో కుమురం భీం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజాం పాలనలో భూముల ఆక్రమణ, శిస్తుల భారంపై కొమరం భీం నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటం జరిగిందని, నైజాం తుపాకీ గుండ్లకు ఆయన బలైనాడని తెలిపారు. ఇప్పటికీ అవే విధానాలను నరేంద్ర మోదీ అవలంభిస్తూ గిరిజనులను భూముల నుంచి వెళ్లగొట్టి ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని చూస్తోందని, అందుకే జూలై 26న అటవీ హక్కుల సంరక్షణ చట్టం తీసుకొచ్చారని అన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించటమే కుమురం భీంకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో కొరసం రామ్ శెట్టి, కొరసం వెంకటేష్, కొర్సం వీర్రాజు, కురసం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ దాడిని ఖండించాలి

అశ్వారావుపేటరూరల్: గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం పేరుతో పాలస్తీనియన్లను అణిచివేతకు గురిచేయడాన్ని ప్రజాతంత్ర వాదులంతా ఖండించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం నాగదుర్గ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇజ్రాయెల్‌కు రాజకీయ, సైనిక తోడ్పాటు అందించే అమెరికా చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భాగ్యలత, దేవి, విజయకుమారి, కనకమ్మ, పద్మ, పుష్ప పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ శనివారం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్ మాట్లాడుతూ.. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని అమానవీయ చర్యగా అభివర్ణించారు. పాలస్తీనాకు సంఘీభావంగా శనివారం సీఐటీయూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పట్టణ కో–కన్వీనర్ మర్లపాటి రేణుక, పట్టణ నాయకులు జి.లక్ష్మణ్, పి.సంతోష్, రమాదేవి, పద్మ, నాగమణి, ఆదిలక్ష్మి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రచారం చేయాలి

అశ్వాపురం: పినపాక నియోజకవర్గంలో రేగా కాంతారావు హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని గడప గడపకు చేరేలా సోషల్ మీడియా శ్రేణులు విస్తృత ప్రచారం చేయాలని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు కర్నె మురళి అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు మల్లెబొయిన ప్రశాంత్ ఆధ్వర్యంలో శనివారం సోషల్ మీడియా కార్యకర్తల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో ఉన్న 41 బూత్‌లలో సోషల్ మీడియా బూత్ స్థాయి అధ్యక్షులను ఇద్దరు చొప్పున నియమించారు. మండల స్థాయిలో సమన్వయ కర్తలుగా పేర్ల సందీప్, కాలువ విజయ్‌రాజును నియమించారు. ఈ సందర్భంగా కర్నె మురళి మాట్లాడుతూ.. ఎన్నికల్లో సోషల్ మీడియాది కీలక పాత్ర అని, ఈ 30 రోజులు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేసి రేగా గెలుపునకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మట్టపల్లి సాగర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి మంగళగిరి రామకృష్ణ, కోరెం రామారావు, గజ్జి లోహిత్‌యాదవ్, వల్లెపోగు రాము, మోదుగు వంశి, అవినాష్, జూపల్లి కిరణ్, సందీప్, మహేష్, వెంకటేష్, రాంప్రసాద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి పనుల బ్రేక్!

- పగటిపూట పొలాల్లో గ్రామీణులు
- రాత్రి వేళలే ప్రచారానికి అనువు..
- మధ్యాహ్నం పట్టణాలకే పరిమితమవుతున్న నేతలు



పొలం పనుల్లో రైతులు, కూలీలు



నాగినేనిప్రోలులో రాత్రివేళ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ప్రధాన రాజకీయపార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. ఉదయం నుంచి రాత్రి వరకు విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నాయి. అయితే అభ్యర్థుల ప్రచారానికి వ్యవసాయపనులు అడ్డంకిగా మారాయి. పగటిపూట గ్రామాల్లోకి ప్రచారానికి వెళితే పెద్దగా స్పందన కనిపించటం లేదు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో మిరప మొక్కలు వేయటం, కలుపులు, పత్తితీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అదేవిధంగా వరి, మొక్కజొన్న సాగు పనుల్లో రైతులు, కూలీలు బిజీబిజీగా ఉన్నారు. పత్తి తీసేందుకు వెళితే మహిళ కూలీలకు రోజుకు రూ.300 నుంచి రూ.450 వరకు కూలిదక్కుతుంది. రైతులు వరిలో మందుల పిచికారీతో పాటుగా, వరికోతలకు సన్నద్ధమవుతున్నారు. ఈ పరిస్థితులు ఎన్నికల ప్రచారాలకు ఒకింత ఇబ్బందికరంగానే మారాయి.

పొద్దునే రైతులు, కూలీలు పొలం పనులకు వెళుతున్నారు. దీంతో ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు, వారి అనుచర వర్గం సాయంత్రం వేళలోనే ప్రచారాలను సాగిస్తున్నాయి. సాయంత్రం ఏడుగంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రచారం సాగిస్తున్నారు. గ్రామాల్లో సాయంత్రం ప్రచారాలు సాగిస్తున్న అభ్యర్థులు పగటిపూట పట్టణప్రాంతాలకే పరిమితమవుతున్నారు. గ్రామాల్లో ముఖ్యనాయకులను కలవటంతో పాటు మహిళాసంఘాల సభ్యులను, కులపెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధానపార్టీలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏరియాల వారీగా, కులాలవారీగా సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను వింటున్నారు. సమస్యల పరిష్కారానికి హామీలను ఇస్తు ప్రచారం చేస్తున్నారు. ప్రచారాలు సాగుతున్న ప్రాంతాలలో కార్యకర్తలకు, స్థానికులకు విందులు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికలకు మరోనెల రోజులు గడువు ఉండటంతో ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచారాలను ప్రస్తుతానికి నెమ్మదిగానే కొనసాగిస్తున్నారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పార్టీల నాయకులు కూడా హడావుడి చేయకుండా తక్కువ మందితో ఇంటింటి ప్రచారాలు సాగిస్తున్నారు. ప్రచార ఖర్చులు లెక్కించేందుకు నిఘా బృందాలు గ్రామాల్లో పర్యటిస్తుండటంతో అయా పార్టీల నాయకులు వాహనాలు, జెండాల హడావుడి లేకుండా ఇంటింటికీ తిరిగి తమ పార్టీల మేనిఫెస్టోలను ఓటర్లకు వివరిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అభ్యర్థులకు ప్రశ్నలు ఎదురవుతున్నాయి. వాటిని పరిష్కరించేందుకు నాయకులు హామీలిస్తు ముందుకు సాగుతున్నారు. నామినేషన్ల పర్వం ముగిసిన తరువాత అయా పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాయి. ప్రస్తుతం గ్రామస్థాయి లీడర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు తిప్పలు పడుతున్నారు. కొన్నిచోట్ల అలకలు, బుజ్జగింపులతో స్థానిక నాయకులను తమవైపుకు తిప్పుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు.

అందుబాటులో ఉండడం లేదు..

వ్యవసాయ పనులతో ఎన్నికల ప్రచారానికి పగటిపూట ఓటర్లు అందుబాటులో ఉండటం లేదు. దీంతో ప్రస్తుతం ఎన్నికల ప్రచారం రాత్రి 7గంటల తరువాతనే ప్రారంభిస్తున్నాం. నామినేషన్ల ఘట్టం ముగిశాక ప్రచారం ఉధృతం చేస్తాం. అప్పటి వరకు రాత్రిపూట గ్రామాల్లో, పగటిపూట పట్టణ ప్రాంతాల్లో ప్రచారం చేస్తాం.

– గోపిరెడ్డి రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

డబ్బున్న వాళ్లకే టికెట్లు



బూర్గంపాడు: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ

బూర్గంపాడు: కాంగ్రెస్‌పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు అండగా నిలిచి 40 వేల సభ్యత్వాలు చేర్పిస్తే.. పార్టీ అధిష్టానం మాత్రం డబ్బున్న వాళ్లకే టికెట్లు ఇచ్చి రాజకీయాలను వ్యాపారం చేసిందని మాజీ జెడ్పీటీసీ, పినపాక కాంగ్రెస్‌పార్టీ ఆశావహుడు బట్టా విజయ్‌గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. పినపాక అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఆశించి భంగపడ్డ ఆయన.. శనివారం వందలాదిమంది తన అనుచరులతో కలసి వేపలగడ్డ గ్రామంలో సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారికి అన్నివిధాలా అండగా ఉండి నాలుగేళ్లుగా పార్టీని నమ్ముకుని పనిచేస్తే.. నిన్న పార్టీలో చేరినవారికి టిక్కెట్ ఇచ్చి నిజమైన కాంగ్రెస్ నాయకులకు ద్రోహం చేశారన్నారు. రైతు డిక్లరేషన్, ఆరు గ్యారెంటీలను నియోజకవర్గంలోని అన్ని ఇళ్లకు తమ అనుచరులతో పార్టీ కార్యకర్తలతో తీసుకెళ్లామన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రకు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసి అన్నివిధాలా బలోపేతం చేశానన్నారు. ఈ తరుణంలో కొత్తగా పార్టీలో చేరినవారికి టిక్కెట్ ఇచ్చి పార్టీకోసం కష్టపడ్డవారికి మొండిచేయి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్టానం చేసిన సర్వేలలో కనీసం పేరు కూడా లేని వ్యక్తులకు డబ్బు ఉందనే ఒకే కారణంతో టికెట్ ఇవ్వటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తనను నమ్ముకున్న అభిమానులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు తాటి వీరాంజనేయులు, పాయం వెంకటేశ్వర్లు, సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయానికి కట్టుబడుతాం.. కానీ భరోసా ఇవ్వండి..



మణుగూరుటౌన్: మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఆశావహులు

మణుగూరుటౌన్: పినపాక నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డామని, ఇంత కాలం పార్టీని నమ్ముకున్న తమకు అదిష్టానం భరోసా కల్పించాలని నియోజకవర్గ ఆశావహులు చందా సంతోష్, పోలెబోయిన శ్రీవాణి, విజయ్‌గాంధీ, కాటబోయిన నాగేశ్వరరావులు అన్నారు. శనివారం సమితిసింగారంలోని చందా సంతోష్ క్యాంప్ కార్యాలయంలో అత్యవసర సమావేశమైన వారు అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు. మాజీ శాసనసభ్యుడిగా అనుభవాన్ని పరిగణిలోకి తీసుకుని పాయంకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని, పార్టీ జెండా పట్టుకుని పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సభ్యత్వాలు చేసిన తమ భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని అధిష్టానాన్ని కోరారు. పార్టీ లైన్ దాటే ప్రసక్తే లేదని చెప్పిన వారు తమను నమ్ముకున్న నాయకులకు, కార్యకర్తలకు భరోసా బాధ్యత అధిష్టానానికి ఉందన్న విషయం గుర్తించకపోవడం బాధకరమన్నారు. మరో రెండు రోజుల్లో అనుచరులతో ప్రత్యేక సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

సమస్యలుంటే తెలియజేయాలి..



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మంగీలాల్

భద్రాచలంటౌన్: భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థు ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని భద్రాచలం ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంగీలాల్ కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి రాజకీయ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసే అభ్యర్థులకు నామినేషన్ విషయంలో సుచనలు, సలహాలు అందజేస్తామన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకులు, అభ్యర్థులకు పూర్తి వివరాలను ఆర్డీఓ అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

సరైన సదుపాయాలు ఉండాలి



అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్

చండ్రుగొండ: పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని నోడల్ అధికారి ఎస్.రామం సెక్టార్ అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ర్యాంపులు ఇలా అన్ని సదుపాయాలు కేంద్రాల్లో ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సాదియాసుల్తాన పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతుల కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సెక్టార్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలలో కరెంటు, మంచినీటి సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. యువతి, యువకులు ఈ నెల 31వ తారీకు నూతనంగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

మణుగూరురూరల్: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పినపాక నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని రామానుజవరం, పగిడేరు, సాంబాయిగూడెం, లంకమల్లారం, ముత్యాలమ్మనగర్, కూనవరం, సమితిసింగారం గ్రామపంచాయతీల్లో శనివారం పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోల కరపత్రాలను పంపిణీ చేశారు. పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి నియోజకవర్గ ఎమ్మెల్యేగా రేగా కాంతారావును భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, బీఆర్ఎస్ నాయకులు ముత్యంబాబు, రామిడి రామిరెడ్డి, అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, యాదగిరిగౌడ్, బుద్ద రాజు నవీన్‌బాబు, సర్పంచ్‌లు కొమరం జంపేశ్వరి, ఏనిక ప్రసాద్, ఎంపిటిసి గుడిపూడి కోటేశ్వరరావు, మేకల రవి, జావిద్ పాషా, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావును గెలిపించాలని సారపాకలో ఆ పార్టీ నాయకులు శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. సారపాకలోని ఖాసీంసార్ వీధి, గణేష్‌కాలనీ వాసులు బీఆర్ఎస్‌కు ఓటేస్తామని తీర్మానం చేసి పార్టీ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మేకల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి, తనను గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కోరారు. శనివారం మండల పరిధిలోని పూసుకుంట గ్రామంలో పర్యటించిన అశ్వారావుపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా తనను గెలిపించాలని కోరుతూ, విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామం అంతా కలియ తిరిగి బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, సోడెం మహాలక్ష్మి, గంగరాజు, ప్రభాకర్, రాయల నాగేశ్వరరావు, దొడ్డా నాగేశ్వరరావు, బాల శ్రీను పాల్గొన్నారు.



దమ్మపేట: పూసుకుంట గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా

పినపాక: మండలంలోని బీఆర్ఎస్ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బయ్యారం పంచాయతీలోని 6వ వార్డులో శనివారం ఇంటింటికీ తిరుగుతూ పథకాలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రజలకు ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో మండల నాయకులు ముక్కు వెంకటేశ్వర రెడ్డి, ముక్కునాసర రెడ్డి, వెన్న కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు ఆలయ అధికారులు అన్నప్రసాదాలను అందజేశారు. కల్యాణంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట మొండికుంట–భద్రాచలం రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. ఇటీవల పాఠశాల ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందటంతో పాఠశాల నుంచి బయటకు రావాలంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాల ఎదుట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి వాహనాల వేగం నియంత్రించాలని ఎంతో కాలంగా కోరుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మల్లెలమడుగు హైస్కూల్ ఎదుట రహదారిపై స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

అమ్మవారి శోభాయాత్ర

అశ్వారావుపేటరూరల్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలు అందుకున్న కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు శనివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆలయం నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్, రింగ్ రోడ్ సెంటర్, జంగారెడ్డిగూడెం రోడ్‌తోపాటు పురవీధులలో అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీలోని సత్యనారాయణపురం గ్రామానికి వల్లపు మల్లయ్య ఇటీవల మృతి చెందగా శనివారం పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు మృతుని నివాసంలో మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మల్లెలమడుగు గ్రామంలో మాజీ ఎంపీటీసీ దేవరపు వెంకటయ్య ఇటీవల మృతి చెందగా దశ దినకర్మకు మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అయోధ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసరెడ్డి, ఉపేందర్, మల్లికార్జున్ హాజరై నివాళులర్పించారు.

త్వరలో ఉద్యమకారుల అభ్యర్థి?



నినాదాలు చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గం నుంచి రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన ఉద్యమకారుల తరుపున ఓ అభ్యర్థిని ఎన్నికల్లో నిలబెట్టే యోచనలో ఉన్నట్లు స్థానిక ఉద్యమకారులు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం సాధించిన తరువాత తమను ప్రభుత్వం విస్మరించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ.. శనివారం స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఉద్యమకారుడు అకినేపల్లి సైదులు అధ్యక్షతన ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమకారులకు 2.5 సెంట్ల స్థలం ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టిన బీఆర్ఎస్ పార్టీ దాని అమలుకు ఊసే లేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల సాధనే ధ్యేయంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం అనేక కేసులు, ఇబ్బందులు పడ్డామని, అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పక్కన పెట్టారని విమర్శించారు. ఉద్యమ కారులకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టి పింఛన్ ఇవ్వాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అమరులైనవారి కుటుంబానికో ఉద్యోగం ఇవ్వాలన్నారు. సమావేశంలో అశ్వాపురం, బూర్గంపహాడ్, మణుగూరు మండలాల ఉద్యమకారులు గుండ్ల వెంకటేశ్వర్లు(జీవీ), వలసాల వెంకటరామారావు, పనితి సామ్రాజ్యం, పనితి వెంకటేశ్వర్లు, ఆర్.ప్రభావతి, నాగుల్ మీరా, జగ్గన్న, గాండ్ల సురేశ్, గుండగాని శ్రీను, దూలగొండి ఇజ్రాయిల్, ఊరగొండి లక్ష్మణ్, అకినేపల్లి శ్రీను, ప్రభ, నల్లమోపు సురేశ్, దుర్గారావు, సుదర్శన్, ప్రసాద్, తోపేటి సత్యనారాయణ ఉన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కవాతు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్, పోలీస్ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: ఈ ఫొటో చూస్తే ఇదేదో.. పోలీస్ బలగాల ప్రదర్శన అనుకుంటే పొరపాటే. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం అశ్వారావుపేటలో స్థానిక పోలీసు సిబ్బంది కవాతు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, శ్రీ పొట్టిశ్రీరాములు, గాంధీబొమ్మ సెంటర్ మీదుగా రింగ్ రోడ్ సెంటర్ వరకు సీఆర్పీఎస్, పోలీస్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో నిర్వహించే బందోబస్తులో భాగంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని జాగ్రత్తలు తీసుంటున్నామని అన్నారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాపై చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. అనంతరం ఆయన సిబ్బంది కలిసి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన కావడిగుండ్ల, కొత్తకమ్మాయిగూడెం, గాండ్లగూడెం, రామన్నగూడెం గ్రామాల్లో పర్యటించారు. సమావేశాలు ఏర్పాటు చేసి మావోయిస్టులకు సహకరించొద్దని స్థానికులకు సూచించారు. ఆపై ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐ కరుణాకర్, నియోజకవర్గంలోని ఎస్సైలు పీ శ్రీకాంత్, శివ రామకృష్ణ, సాయికిషోర్‌రెడ్డి, రవి కుమార్,సందీప్ కుమార్, షాహీన పాల్గొన్నారు.

ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నియోజవర్గాల్లో పార్టీకి సంబంధించి ఆయా స్థానిక నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు అందజేశారు. పలుచోట్ల ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయా స్థానాల్లోని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి పొంగులేటికి బహుమతిగా అందజేస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. కార్యక్రమాల్లో పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పొంగులేటి అభిమానులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: కేక్ తినిపిస్తున్న పాయం వెంకటేశ్వర్లు



అశ్వారావుపేటరూరల్: కేక్ కట్ చేస్తున్న జారే ఆదినారాయణ, తదితరులు



అశ్వాపురం: అమ్మగారిపల్లిలో పొంగులేటి జన్మదిన వేడుకలు..